

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మే 17: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు శుక్రవారం ప్రకటించారు. రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో ఈ నెల 22 వరకు కనిష్ఠంగా 2 ఎంఎం నుంచి గరిష్ఠంగా 15 ఎంఎం వర్షపాతం నమోదవుతుందన్నారు. రైతులు వేసవి దుక్కులు చేసుకుని ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని ఆయన సూచించారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత
- ఎస్పీ తుహిన్‌సిన్హాతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

పాడేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపునకు పాడేరులో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, అరకులోయ అసెంబ్లీ స్థానం రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఏఎస్పీ కె.ధీరజ్‌లతో కలిసి శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అలాగే ఓట్ల లెక్కింపు గదులను పరిశీలించి అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు, బారికేడింగ్‌లు నిర్మించాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ ఏర్పాట్లలో భాగంగా ఎక్కడెక్కడ ఐరన్ మెష్‌లు ఏర్పాటు చేయాలో ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి తలుపులకు వేసిన సీళ్లను పరిశీలించారు. అక్కడ విజిట్‌బుక్‌లలో కలెక్టర్, ఎస్పీ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈఈ పి.అనుదీప్, సీఐ డినవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ తుహిన్‌సిన్హాతో కలిసి స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

అనుమతుల కోసం నిరీక్షణ

ఏటా మే నెలలో డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు

- ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ ప్రశాంత్‌కుమార్



డొంకరాయి పవర్ కెనాల్ (ఫైల్ ఫొటో)

సీలేరు, మే 17: డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులకు అనుమతులు కోరామని సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మే నెలలో డొంకరాయి నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీరందించేందుకు నిర్మించిన 16 కిలోమీటర్ల కెనాల్‌కు నిర్వహణ పనులు చేపడుతుంటామన్నారు. కెనాల్ ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వాటిని గుర్తించి అక్కడ పటిష్ఠత కోసం గ్రౌటింగ్, కాంక్రీట్ పనులను నిర్వహిస్తామని చెప్పారు. కెనాల్ నిర్వహణ పనులు చేపడితే సీలేరు కాంప్లెక్సులోని 25 మెగావాట్ల సామర్థ్యం గల డొంకరాయి జల విద్యుత్ కేంద్రం, 460 మెగావాట్ల సామర్థ్యం గల పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. ఎగువ సీలేరులో విద్యుదుత్పత్తికి ఎటువంటి ఆటంకం ఉండదన్నారు. కెనాల్ నిర్వహణ పనులకు గ్రిడ్ అధికారులు, జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఎల్‌సీ అనుమతులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. సీలేరు పర్యటనకు వచ్చిన హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ కూడా కెనాల్‌ను పరిశీలించారన్నారు. సీలేరు కాంప్లెక్సు నీటిని సరఫరా చేసే బలిమెల జలాశయంలో ఆంధ్రా వాటాగా 7 టీఎంసీలు, డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో 7 టీఎంసీలతో కలిపి 14 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని, ఈ నీటినే వర్షాకాలం సీజన్ ప్రారంభం అయ్యేంత వరకు విద్యుదుత్పత్తికి, తాగునీటి అవసరాలకు పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా

పాడేరు పండగపై పల్నాడు ఎఫెక్ట్

- రాష్ట్రంలో పలు అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో ఉత్సవాల తేదీల మార్పు
- జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయం



పాడేరు మోదకొండమ్మ అమ్మవారు

పాడేరు, మే 17(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తరువాత రాష్ట్రంలో ప్రధానంగా పల్నాడు జిల్లాలో జరిగిన హింస, అవాంఛనీయ ఘటనల ప్రభావం ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరగనున్న మోదకొండమ్మ ఉత్సవాలపై పడింది. దీంతో ఉత్సవాలు వాయిదా పడ్డాయి. రాష్ట్రంలోని తాజా ఘటనల నేపథ్యం, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున మోదకొండమ్మ ఉత్సవాల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేమని కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా తేల్చి చెప్పారు. ఒక వేళ ఉత్సవాలను నిర్వహించుకోవాలనుకుంటే, ఎటువంటి హడావిడి లేకుండా కేవలం ఆలయంలో అమ్మవారికి పూజలతోనే సరిపెట్టాలని సూచించారు. దీంతో ఉత్సవాలను నిర్వహించలేమని, తాజా ఘటనల నేపథ్యంలో ఉత్సవాలను వాయిదా వేసి జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తామని ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతిధులు పేర్కొన్నారు.



ఉత్సవాలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ఉత్సవాలకు 90 శాతం ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 19 నుంచి ఉత్సవాలు మొదలు కానుండడంతో అందుకు అవసరమైన ఏర్పాట్లను దాదాపు 90 శాతం పూర్తి చేశారు. ఆలయానికి రంగులు, ఆలయ ప్రాంగణం ముస్తాబుతో పాటు, ఉత్సవ విగ్రహాన్ని కొలువుతీర్చే శతకంపట్టు నిర్మాణం చేపట్టారు. పట్టణంలోని వీధుల్లో విద్యుత్ అలంకరణ పనులు పూర్తి చేశారు. అవసరమైన చోట్ల భారీ విద్యుత్ కటౌట్‌లను అమర్చడంతోపాటు మెయిన్‌రోడ్డులో సీరియల్ సెట్‌లు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్లే జోన్‌కు సంబంధించిన ఏర్పాట్లు జరిగాయి. అక్కడ జెయింట్ వీల్, డిస్కోడ్యాన్స్, డ్రాగన్ ట్రైన్, పలు రకాల చిన్నపిల్లల ఆటల పరికరాలను ఏర్పాటు చేశారు.

హడావిడి వద్దు.. పూజలతోనే సరి

ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరిగే మోదకొండమ్మ ఉత్సవాల్లో అధికారికంగా చేపట్టాల్సిన సదుపాయాలపై ఎస్పీ తుహిన్‌సిన్హాతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో శుక్రవారం ... మిగతా 8వ పేజీలో

ఎర్రగొండమ్మ జాతర వాయిదా

- జూన్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణకు ఉత్సవ కమిటీ నిర్ణయం

కొయ్యూరు, మే 17: రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున శాంతి భద్రతల కారణాల దృష్ట్యా ఈ నెల 24 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించాల్సిన ఎర్రగొండమ్మ జాతరను వాయిదా వేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నడింపాలెం, శరభన్నపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం ఎర్రగొండమ్మ జాతరను జూన్ 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. వాయిదా పడిన జాతరకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం అరకు ఎంపీ మాధవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్, నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సోమగాంధీ, ఆయా పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాతో విద్యార్థిని మృతి



భూమిక (ఫైల్ ఫొటో)

చింతపల్లి, మే 17: మండలంలోని బలపం పంచాయతీ తూరుమామిడి గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని సికిల్‌సెల్ ఎనీమియాతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. తూరుమామిడి గ్రామానికి చెందిన కోరాబు భూమిక(18) పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీఎస్సీ చదువుతోంది. ఆమె కొంత కాలంగా సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతూ మందులు వాడుతున్నది. ప్రస్తుతం సెలవులు కావడంతో ఆమె వారం రోజుల కిందట తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లడంతో వైద్యాధికారులు ప్రాథమిక చికిత్స చేసి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్స అందించి కేజీహెచ్‌కి తరలించారు. ఐదు రోజులుగా ఆ విద్యార్థిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నది. గురువారం రాత్రి ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది.

రూ.28 కోట్లతో ఐదు రిసార్టుల ఆధునికీకరణ

ఏపీటీడీసీ ఈఈ రమణ



మయూరి హిల్ రిసార్టు

అరకులోయ, మే 17: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఐదు టూరిజం రిసార్టులను ఆధునికీకరిస్తున్నట్టు పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రమణ తెలిపారు. అరకులోయలోని మయూరి హిల్ రిసార్టులో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు శుక్రవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఐదు టూరిజం యూనిట్లకు సుమారు రూ.28 కోట్లతో ఆధునికీకరణ పనులతో పాటు స్విమ్మింగ్ పూల్స్ లేని చోట కొత్తగా నిర్మిస్తున్నట్టు చెప్పారు. విశాఖపట్నంలో యాత్రీ నివాస్‌ను రూ.6 కోట్లతో, తైడా జంగిల్‌బెల్స్‌ను రూ.4 కోట్లతో, అనంతగిరి హిల్ రిసార్టును రూ.6 కోట్లతో, అరకులోయ హరితవేలీ రిసార్టు, మయూరి హిల్ రిసార్టును రూ.12 కోట్లతో ఆధునికీకరిస్తున్నట్టు తెలిపారు. అనంతగిరి, తైడా, మయూరి హిల్ రిసార్టుల పరిధిలో నూతనంగా స్విమ్మింగ్ పూల్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో పనుల్లో కొంత జాప్యం జరిగిందని, ప్రస్తుతం పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సీజన్‌లో రిసార్టుల ఆధునికీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఆయన వెంట మయూరి హిల్ రిసార్టు ఇన్‌చార్జి మేనేజర్ సింగ్, ఏఈఈ రాము, వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు ఉన్నారు.




హరిత వేలీ రిసార్టు

బొర్రా గుహల అభివృద్ధికి ప్రణాళిక

ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా గుహలను మరింత అభివృద్ధి చేసేందుకు, పరిసరాలను ఆధునికీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఈఈ రమణ తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదని, త్వరలో టెండర్ పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

నింగిలో భిన్న వర్ణాలు



శుక్రవారం ఉదయం 5 గంటలకు పాడేరులో ఆకాశం

మన్యంలో ప్రకృతి విభిన్నంగా అలరించడం సహజం. శుక్రవారం తెల్లవారుజామున పాడేరులో సూర్యోదయానికి కొన్ని క్షణాల ముందు ఆకాశమంతా కాషాయం వర్ణంలో ఎంతగానో ఆకట్టుకున్నది. అలాగే మధ్యాహ్నం తీవ్రమైన ఎండ కాస్తున్న సమయంలో నీలాకాశంలో వెండి మబ్బులు కమ్ముకున్న దృశ్యం ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకర్షించింది. ఒకే రోజు నింగిలో భిన్నమైన వర్ణాలతో అలరించిన ప్రకృతి దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

\- ఆంధ్రజ్యోతి/పాడేరు



మధ్యాహ్నం 2 గంటలకు నీలాకాశంలో వెండి మబ్బులు



అరకులోయ గిరిజన మ్యూజియం వద్ద పర్యాటకులు

పర్యాటకుల సందడి

- వేసవి సెలవులు కావడంతో పర్యాటక ప్రాంతాలు రద్దీ

పర్యాటకులతో అరకులోయ శుక్రవారం సందడిగా కనిపించింది. వేసవి సెలవుల నేపథ్యంలో గత మూడు రోజులుగా పర్యాటకులు వస్తున్నారు. దీంతో బొర్రా గుహలు, అరకులోయ పద్మాపురం గార్డెన్స్, గిరిజన మ్యూజియం ప్రాంతాలు రద్దీగా మారాయి.

\- అరకులోయ



వర్షాలకు కోతకు గురైన దొరగూడ రహదారి

ఇలా ఉంటే ఎలా వెళ్లేది?

ముంచంగిపుట్టు, మే 17: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గత ఏడాది కురిసిన వర్షాలకు కోతకు గురైంది. పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. కనీస మరమ్మతులు చేయకపోవడంతో అధ్వానంగా మారింది. దీంతో అటుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రైం... crime news

జీపు బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన నూకరాజు

మాడుగుల రూరల్, మే 17: మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి ఓ జీపు బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపంలోని నక్కలపుట్టుకు చెందిన ఊడి నూకరాజు తన జీపును పాడేరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి అద్దెకు తిప్పుతున్నాడు. అతని వద్ద సున్నం హరీశ్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం హరీశ్ జీపులో కార్యాలయం పని మీద విశాఖపట్నం వెళ్లి సాయంత్రం తిరిగి పాడేరు వస్తున్నాడు. చోడవరం దాటిన తరువాత వడ్డాది జంక్షన్‌లో ఉన్న ఆ జీపు యజమాని నూకరాజును జీపులో ఎక్కించుకుని బయలుదేరాడు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఎంకే వల్లాపురం దాటిన తరువాత ఘాట్‌రోడ్డు జంక్షన్ మధ్యలో గల చెరకు కాటా వద్దకు వచ్చేసరికి ఎదురుగా వాహనం రావడంతో దానిని తప్పించే క్రమంలో జీపు అదుపు తప్పింది. అది పంట కాలువ పక్కన ఖాళీ స్థలంలో బోల్తా పడడంతో స్థానికులు గుర్తించి జీపులోని ఇద్దర్నీ బయటకు తీశారు. 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వారిని మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జీపు యజమాని నూకరాజు తల, మెడ వెనుక భాగంలో గాయాలయ్యాయి. డ్రైవర్ హరీశ్‌కి నుదుటిపై స్వల్ప గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించే ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్కాపురం, మే 17: షిప్‌యార్డు న్యూకాలనీ సమీపంలో గల ఏకేసీ కాలనీ జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో షిప్‌యార్డు సొసైటీ మాజీ ఉద్యోగి ఎండీ హుస్సేన్ (45) మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డారు. సింధియా నుంచి మల్కాపురం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా న్యూకాలనీ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆవు అడ్డంగా రావడంతో దానిని ఢీకొని రోడ్డుపై తుళ్లిపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా హుస్సేన్ మృతి చెందాడు. వెంకటరమణ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడు హుస్సేన్ గాజువాక చెందిన వాడు కాగా, వెంకటరమణది మల్కా పురం. మల్కాపురం పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

వేసవి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం

భువనేశ్వర్ నుంచి దువ్వాడ మీదుగా ముంబైకి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మే 17: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని దువ్వాడ మీదుగా నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొద్ది రోజులు కొనసాగించనున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (06507) ఈనెల 24 నుంచి జూన్ 14 వరకు, ఖరగ్‌పూర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06508) ఈనెల 27 నుంచి జూన్ 17 వరకు, బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్‌ను (06585) ఈనెల 31 నుంచి జూన్ 14 వరకు, హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06586) జూన్ ఒకటి నుంచి జూన్ 15 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-గుహవటి ఎక్స్‌ప్రెస్‌ను (06569) ఈనెల 26 నుంచి జూన్ తొమ్మిది వరకు, గుహవటి--ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06570) ఈనెల 29 నుంచి జూన్ 12 వరకూ పొడిగించామని పేర్కొన్నారు. కాగా ఎస్ఎంవీ బెంగళూరు-మల్దా టౌన్ ఎక్స్‌ప్రెస్ (06563) జూన్ 6న (ఆదివారం), మల్దా టౌన్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (06564) జూన్ 12న (బుధవారం), మైసూరు-ముజాఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (06221) జూన్ 10న (సోమవారం), ముజాఫర్‌పూర్-మైసూరు ఎక్స్‌ప్రెస్ (06222) జూన్ 13న (గురువారం) అందుబాటులో ఉంటాయని తెలిపారు.

భువనేశ్వర్ నుంచి షోలాపూర్, ముంబైలకు ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా భువనేశ్వర్ నుంచి షోలాపూర్, ముంబై స్టేషన్లకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని, అయితే ఈ రైళ్లు ఒకవైపు మాత్రమే నడవనున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 01452 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) ఉదయం 4.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి 11.43 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 7.00 గంటలకు షోలాపూర్ చేరుతుంది. 01056 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) రాత్రి 11.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 6.45 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ముంబై వెళుతుంది.

దివ్యాంగ యువతకు ఐటీఐలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, మే 17: బక్కన్నపాలెంలోని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శిక్షణ సంస్థ 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి దివ్యాంగ యువతకు ఐటీఐలో శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈమేరకు ప్రాజెక్టు ఆఫీసర్ పీవీ రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పెంటర్ 24, షీట్ మెటల్ వర్కర్ 20, వెల్డర్ 20, పెయింటర్ 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పదో తరగతి పాసైన వారు అర్హులని, ఏడాది పాటు శిక్షణ ఉంటుందన్నారు. మొదటి విడత కౌన్సెలింగ్ జూన్ 10న జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు ఈ కేంద్రం నుంచే శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎంపికైన వారికి ఉచిత ఫీజు, భోజనం, వసతి కల్పించడంతో పాటు జాబ్‌మేళా నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఒలుపు చందనం విక్రయాలకు బ్రేక్


బారులుదీరిన భక్తులు

సింహాచలం, మే 17: వరాహలక్ష్మీనృసింహస్వామి ఒలుపు చందనం విక్రయాలను శనివారం నిలుపుదల చేస్తున్నట్టు దేవాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19, 20, 21 తేదీల నుంచి మళ్లీ విక్ర యాలు కొనసాగుతాయని చెప్పారు. ఈనెల 16 నుంచి ప్రారంభమైన ఒలుపు చందనం విక్రయాలు శుక్రవారం కూడా కొనసాగాయి. రెండవ రోజు చందనం ప్రసాదాల కొనుగోలుకు ఉత్తరాంధ్ర నలుమూలలు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సూర్యోదయం నుండే క్యూలో బారులు తీరారు. ఒకదశలో క్యూ ప్రసాదాల విక్రయాల కేంద్రం నుంచి సుమారు వంద మీటర్ల దూరంలో ఉన్న నిత్యాన్న ప్రసాద భవనం వరకు కనిపించింది. దేవాలయ ఏఈఓ ఎన్. ఆనందకుమార్ విక్రయాల కౌంటర్ వద్ద స్వయంగా ఉండి పర్యవేక్షిస్తూ వెయ్యి పేకెట్ల వరకూ విక్రయించారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, మే 17: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దూర విద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ ధర్మారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో వెబ్‌సైట్‌లోని అడ్మిషన్ లింకు ద్వారా ప్రవేశాలు పొందవచ్చునన్నారు. అన్ని కోర్సుల్లోనూ ప్రవేశాలకు దరఖాస్తు గడువు జూన్ 30 అని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 0891 2511200ను సంప్రతించాలని సూచించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఎంపీ అభ్యర్థికి రెండు ఓట్లు తేడా కొట్టింది...

నర్సీపట్నం నియోజకవర్గంలోని ఎనిమిదిపోలింగ్ కేంద్రాల్లో ఓట్లలో హెచ్చు తగ్గులు

- ఎమ్మెల్యే అభ్యర్థి పడి.. ఎంపీకి పడని ఓట్లు 7
- ఎంపీ అభ్యర్థికి పడి.. ఎమ్మెల్యేకి పడని ఓట్లు 5
- ఎమ్మెల్యే కంటే ఎంపీ అభ్యర్థికి రెండు ఓట్లు తక్కువ పోలింగ్


నర్సీపట్నంలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, మే 17 : సార్వత్రిక ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంటే ఎంపీ అభ్యర్థికి రెండు ఓట్లు తక్కువ పోలయ్యాయి. ఈ నియోజకవర్గంలో నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో మొత్తం 2,12,046 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఎమ్మెల్యే అభ్యర్థికి 1,79,852 ఓట్లు, ఎంపీ అభ్యర్థికి 1,79,850 ఓట్లు పడ్డాయి. ఎమ్మెల్యే కంటే ఎంపీ అభ్యర్థికి రెండు ఓట్లు తక్కువ పోలయ్యాయి. నియోజవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాలలో ఎనిమిది పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌లో ఓట్ల హెచ్చు తగ్గులు కనిపించాయి. ఇందుకు ఉదాహరణ.. నాతవరం 85వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 503, ఎంపీ అభ్యర్థికి 504 ఓట్లు పోలింగ్ జరిగింది. ఈ కేంద్రంలో ఎమ్మెల్యే కంటే ఎంపీకి ఒక ఓటు ఎక్కువ పడింది. నాతవరం మండలం శృంగవరంలోని 102వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 734 ఓట్లు, ఎంపీకి 732 ఓట్లు పడ్డాయి. ఈ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కంటే ఎంపీకి రెండు ఓట్లు తక్కువ పడ్డాయి. ఇక్కడే ఉన్న 103వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 641, ఎంపీకి 642 ఓట్లు వేశారు. ఇక్కడ ఎమ్మెల్యే కంటే ఎంపీ అభ్యర్థికి ఒక ఓటు ఎక్కువ పోలైంది. అలాగే, నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధి బలిఘట్టంలోని 150 పోలింగ్ కేంద్రంలో ఎమ్మెలే అభ్యర్థికి 905 ఓట్లు, ఎంపీ అభ్యరికి 903 ఓట్లు పోలయ్యాయి. ఈ కేంద్రంలో ఎమ్మెల్యేకి రెండు ఓట్లు ఎక్కువ పోలయ్యాయి. నర్సీపట్నం మండలం కేఎల్‌పురంలోని 191వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 643 ఓట్లు, ఎంపీకి 642 ఓట్లు పడ్డాయి. పెదబొడ్డేపల్లి 198వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యేకి 918 ఓట్లు, ఎంపీకి 919 ఓట్లు పడ్డాయి. జోగినాథునిపాలెంలోని 202వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యేకి 885, ఎంపీకి 887 ఓట్లు పడ్డాయి. నర్సీపట్నంలోని 164వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యేకి 602 ఓట్లు, ఎంపీకి 600 ఓట్లు పడ్డాయి. పోలింగ్ కేంద్రాలు 85, 102, 103, 150, 191, 198, 202, 164 పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థికి పడి ఎంపీ అభ్యర్థికి పడని ఓట్లు 7 ఉంటే, ఎంపీకి పడి ఎమ్మెల్యే అభ్యర్థికి పడని ఓట్లు 5 ఉన్నాయి. నియోకవర్గంలో మొత్తం పోలైన ఓట్లు చూసుకుంటే ఎమ్మెల్యే కంటే ఎంపీకి రెండు ఓట్లు తక్కువ పడ్డాయి.

21న సతకంపట్టుకు మోదకొండమ్మ

- వచ్చే నెల 18న మాడుగులలో అమ్మవారి జాతర
- భారీ ఏర్పాట్లు చేపట్టనున్నట్టు కమిటీ సభ్యులు వెల్లడి


మాడుగుల మోదకొండమ్మ

మాడుగుల, మే 17: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ జాతర జూన్ 18వ తేదీన జరగనుంది. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీ ఆదివారం జాతర చాటింపు, 21వ తేదీ మంగళవారం సతకంపట్టు వద్ద అమ్మవారు కొలువుదీరనున్నారని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పరాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొలుత జూన్ మొదటి వారంలో జాతర నిర్వహించాలని భావించామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కమిటీ సభ్యులమంతా చర్చించి ఈ మేరకు వాయిదా వేసినట్టు చెప్పారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల సహకారం తీసుకోనున్నట్టు చెప్పారు. ఇదిలావుంటే, జాతర సందర్భంగా అమ్మవారి మాలధారణ చేసే భక్తులకు ఉచితంగా దండలు ఇవ్వడం జరుగుతుందని సభ్యులు తెలిపారు. ఇవే దండలు బయట మార్కెట్‌లో రూ.350కి విక్రయిస్తున్నట్టు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథ శ్రీనివాసరావు, కొట్యాడ మల్లిఖార్జునరావు, కుప్పిలి భవానీ శంకర్, దర్శిశెట్టి అప్పారావు, ద్రాక్షారపు అచ్యుతరావు, దాడి అవినాష్, బెజవాడ రాజేశ్వరరావు, పల్లెల రాములు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో దారుణం

- ప్రైవేటు లే-అవుట్ ధ్వంసం చేసి గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- లబోదిబోమంటున్న ప్లాట్ల యజమానులు


గొల్లలపాలెం శివారు జగన్నాథపురంలో ప్రైవేటు లే-అవుట్‌లో తవ్వుకుపోయిన గ్రావెల్

సబ్బవరం, మే 17: మండలంలోని గొల్లలపాలెం శివారు జగన్నాథపురం గ్రామంలో గ్రావెల్ అక్రమార్కులు రెచ్చిపోయారు. ఓ ప్రైవేటు లే-అవుట్‌లో కొన్ని రోజులుగా దర్జాగా రాత్రి వేళల్లో గ్రావెల్/మట్టిని యంత్రాల సాయంతో తవ్వి ట్రాక్టర్లు, డంపర్లతో తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారు. గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 273 పూరాలో 53.90 ఎకరాల భూమి ఉంది. అందులో 273/2లో 14.90 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. సదరు భూమిని కొందరు 40 ఏళ్ల క్రితం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. 1983లో ప్రభుత్వ భూమిని కలుపుకొని 53.90 ఎకరాల్లో పంచాయతీ లే-అవుట్ వేశారు. సుమారు 600 ప్లాట్లు 266 గజాలు చొప్పున వేసి అప్పట్లోనే అమ్మేశారు. అయితే ఇటీవల 273/2లో 14.90 ఎకరాలు ప్రభుత్వ భూమి అని వెలుగులోకి రావడంతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు పెట్టారు. అయితే మిగిలిన 39 ఎకరాల్లో పక్కా లే-అవుట్‌లో ప్లాట్లు ఉన్నాయి. ఈ లే-అవుట్ పైడివాడ అగ్రహారం జగనన్న కాలనీకి ఆనుకొని ఉండడం, జనావాసాలకు దూరంగా ఉండడంతో కొంత మంది అక్రమార్కులు కళ్లు ఈ లే-అవుట్‌పై పడ్డాయి. సబ్బవరంతో పాటు గాజువాక, లంకెలపాలెం ప్రాంతాల్లో ఇళ్ల బేస్మెంట్లు, లే-అవుట్లు ఫార్మేషన్‌కు గ్రావెల్/మట్టికి డిమాండ్ ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోయి వందలాది లారీలతో తరలించుకుపోయారు. ప్లాట్ల యజమానులు ఆలస్యంగా తెలుసుకొని లబోదిబోమంటున్నారు. సుమారు 5 నుంచి, 6 అడుగులు లోతులో గ్రావెల్/ మట్టి తవ్వేయడంతో లే-అవుట్‌లో ప్లాట్లు ఆనవాళ్లు లేకుండా పోయాయని వాపోతున్నారు. చాలా మంది ప్లాట్లు తనఖా పెట్టి బ్యాంక్‌లో రుణాలు కూడా తీసుకున్నట్టు చెబుతున్నారు. మైనింగ్, పోలీస్ అధికారులు దృష్టిసారించి గ్రావెల్/మట్టి తవ్వకాలు జరిపిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం మారితే.. మా పరిస్థితి ఏమిటీ?

- కొత్త ప్రభుత్వంలో అవకాశం ఉంటుందా..!
- గ్రామ, వార్డు వలంటీర్ల అంతర్మథనం

కోటవురట్ల, మే 17: వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తామే వ్యవహరించిన వలంటీర్లు కొత్త ప్రభుత్వంలో తమ పరిస్థితి ఏమిటని మదనపడుతున్నారు. ఎన్నికల సమయంలో వేలాది మంది వలంటీర్లు విధుల నుంచి తప్పుకున్నారు. అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి ఎన్నికల్లో ధైర్యంగా వైసీపీకి మద్దతుగా పనిచేశారు. మరికొందరు రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారిందని వలంటీర్లు అంటున్నారు. నిరుద్యోగ్య సమస్య తీవ్రంగా ఉండడంతో ఎంతోమంది యువత వలంటీర్లుగా చేరారు. నెలకు రూ.5 వేలు పారితోషికంతో వారు పనిచేశారు. ఒక్కో వలంటీరు పరిధిలో 50ఇళ్లను కేటాయించి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడం, రేషన్ పంపిణీ వంటి విధులను నిర్వహించారు. ప్రజలతో మమేకమైన వలంటీర్లను ఎన్నికల్లో ఉపయోగించుకోవడానికి సేవామిత్ర, సేవారత్న, సేవావజ్రం వంటి పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాల ఫిర్యాదులతో ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచింది. అయితే వలంటీర్లు సేవలను ఎలాగైనా ఉపయోగించుకొని ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న వైసీపీ నాయకులు వారిపై ఒత్తిడి చేసి రాజీనామాలు చేయించారు. కొందరు వలంటీర్లు అయితే అయిష్టత వ్యక్తం చేసినా వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లకు తాము వ్యతిరేకంగా కాదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి పారితోషకం రూ.5నుంచి రూ.10వేలు పెంచి పనులు చేయిస్తామని ఎన్నికల ప్రచారాల్లో హామీ ఇచ్చారు. దీంతో వలంటీర్లుగా పనిచేసి విధుల నుంచి తప్పుకున్న వారు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమను తిరిగి విధుల్లోకి తీసుకుంటారనే ఆశ... నిరాశల మధ్య కొట్టుమిట్టులాడుతున్నారు. రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధుల్లో తీసుకుంటారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఓటింగ్‌పై ఆసక్తి చూపని ఎల్‌టీ.కాలనీ ఓటరు

- ప్రస్తుత ఎన్నికల్లో 55.01 శాతం
- 2019లో 57.3 శాతం ఓటింగ్
- 80వ బూత్‌లో అతితక్కువగా 47.98 శాతం పోలింగ్


పాయకరావుపేటలో లింగాలతోట కాలనీ

పాయకరావుపేట, మే 17: సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేటలోని ఎల్‌టీ.కాలనీ (లింగాలతోట కాలనీ) వాసులు ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈసారి జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పోటెత్తి 75 నుంచి 80 శాతంపైగా ఓటింగ్ జరిగినా ఎల్‌టీ.కాలనీలో 55 శాతం మాత్రమే పోలింగ్ అయ్యింది. ఇక్కడ ఉన్న 80, 81, 82 పోలింగ్ కేంద్రాల్లో 2,523 మంది ఓటర్లుండగా.. 1,388 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80వ పోలింగ్ కేంద్రంలో నియోజకవర్గంలోనే అత్యంత తక్కువగా 47.89 శాతం ఓటింగ్ నమోదయ్యింది. 81లో 796 మందికి 490 (61.56శాతం), 82లో 883 మందికి 541(61.27శాతం) మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎల్‌టీ.కాలనీలో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాల్లో 2,446 మంది ఓటర్లుండగా 1,395(57.3 శాతం) మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉద్యోగులు, వ్యాపారస్తులు అధికంగా ఉండే ఈ కాలనీలో స్థానికేతరులు ఉండడంతో పాటు పలువురు ఎన్నికల్లో ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవడం వలనే ప్రతిసారి ఓటింగ్ శాతం తగ్గుతోందన్న వాదన వినిపిస్తోంది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎంత మొర పెట్టుకుంటున్నా కాలనీలో నివాసముంటున్న వారు ఓటు వేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో ప్రతిసారి జరిగే ఎన్నికల్లో ఇక్కడ ఓటింగ్ శాతం తగ్గుతుండడం కారణమవుతోంది.

టీడీపీకి వేటు వేశారన్న నెపంతో దాడిపై డీసీపీ, ఏసీపీ ఆరా

కంచరపాలెం, మే 17: టీడీపీకి ఓటు వేయలేదనే నెపంతో బర్మాక్యాంప్‌లో లోకేష్ అనే వ్యక్తి జరిపిన దాడిలో గాయపడిన బాధితుల ఇళ్లను పశ్చిమ డీసీపీ మేక సత్తిబాబు, ఏసీపీ అన్నెం నరిసింహమూర్తి శుక్రవారం సందర్శించారు. బాధితులతో వారు మాట్లాడారు. ఘటనపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సుంకర నూకరత్నం, ఆమె తల్లి ధనలక్ష్మి, మణికంఠపై లోకేష్ దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై రాజకీయ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో డీసీపీ, ఏసీపీలు వచ్చి విచారించారు. ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు మద్యం సేవించి బుధవారం లోకేష్ ఇంటి వద్ద న్యూసెన్స్ చేశారని, ఈ నేపథ్యంలోనే లోకేష్ వారిపై దాడి చేసినట్టు స్థానికులను విచారించగా తెలిసిందని డీసీపీ పేర్కొన్నారు. వ్యక్తిగత గొడవలకు రాజకీయ రంగు పులిమితే చర్యలు తీసుకుంటామని డీసీపీ సత్తిబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి ఉన్నారు.

రక్తపోటుపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్



రక్తపోటు నివారిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మే 17: రక్తపోటు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో మెలగాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.హేమంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం మే 17 ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కాలంలో సమాజంలో రక్తపోటు బాధితుల సంఖ్య పెరుగుతుందన్నారు. మారుతున్న జీవనశైలి, శారీరిక శ్రమ లోపించడం, ఫాస్ట్ ఫుడ్స్ కారణంగా చిన్నవయసులోనే రక్తపోటుకు గురవుతున్నారన్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్తపోటు (బీపీ) పరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలన్నారు. నడక, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రక్తపోటును నియంత్రించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా కుటుంబ వైద్య విధాన సమన్వయకర్త డాక్టర్ వీరజ్యోతి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం


పోటీలను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


'నాలోన నీవే' నాటికలో సన్నివేశం

అనకాపల్లి టౌన్, మే 17: స్థానిక వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలను శుక్రవారం రాత్రి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు కారణంగా ఈ పోటీలు ఆలస్యమయ్యాయన్నారు. నాటకాలు, నాటికలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారిన ఈ రోజుల్లో పీసీహెచ్ నాయుడు మూడేళ్లుగా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వీసీహెచ్ నాయుడు, కేఎం నాయుడు, 1974-75 ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దలు నిలబెట్టిన కాపురమే 'నాలోన నీవే' నాటిక

తండ్రి చనిపోయిన శ్రీరామ్‌కు తల్లంటే ప్రేమ, గౌరవం, సర్వస్వం. ప్రేమించి పెళ్లి చేసుకున్న జానకి అంటే కూడా శ్రీరామ్‌కు అంతులేని ప్రేమ, గౌరవం. తన తల్లి, భార్య అన్యోన్యంగా ఉండాలని శ్రీరామ్ తన తల్లితో, మావయ్య ధర్మాత్మతో చెప్పి ఒప్పించి నాటకం ఆడతాడు. అది తెలియని జానకి ఇంట్లో జరుగుతున్న పరిణామాలకు నిద్ర పట్టక భయంతో, ఆందోళనతో డిప్రెషన్ చెందుతుంది. ఆ షైకంలో తండ్రి ధర్మాత్మకు ఫోన్ చేసి నాకు విడాకులు కావాలని కోరుతుంది. కనిపించని ఆ శ్రీరామచంద్రుడు కంటే నన్ను కట్టుకున్న నా భర్త నా శ్రీరామ్ గొప్పని చెప్పావుగా తల్లీ.. అని జానకిని ధర్మాత్మ నిలదీస్తాడు. అవును నా విషయంలో నా శ్రీరామ్ శ్రీరాముడే అయిన నాకు విడాకులు కావాలని కోరుతుంది. శ్రీరామ్ తల్లి పార్వతమ్మ.మావయ్య ధర్మాత్మం కలిసి ఆడిన నాటకమే ఈ నాటిక సస్పెన్స్. గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు.

కుటుంబ సంబంధాలను చాటి చెప్పే 'అమృతహస్తం'

ఒక తల్లి కడుపున పుట్టిక పోయినా అన్నా చెల్లెళ్ల అనుబంధం చాలా గొప్పది. ఆధునిక సమాజంలో మృగ్యమైపోతున్న ఇలాంటి బంధాలు ఎంత అవసరమో సమాజానికి గుర్తు చేయడం ఈ కథాంశం. ప్రేమించి పెళ్లి చేసుకున్న చెల్లెల్ని అష్టకష్టాలు పెడుతున్న భర్తని భరించి వారి కాపురం సజావుగా సాగడానికి అన్న ఎన్నో విధాలుగా ఆదుకుంటూ ఉంటాడు. చెల్లి రోగంతో బాధపడుతుంది. చెల్లెని, బావని ఇంట్లో పెట్టుకుంటాడు అన్న. అయితే భర్త చేసిన పనిని అన్న భార్య తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈలోగా ఆ ఇంట్లో తిష్టవేసిన చెల్లి భర్త ఒక్కోసారి ఒక్కో విధంగా డబ్బులు గుంజుతూ చివరకు అన్న ఉన్న ఇంటిలో సగభాగాన్ని రాయించమని భార్యను వేధిస్తాడు. ఆధునిక టెక్నాలజీతో అతని మాటలు, చేష్టలు, బెదిరింపులు, హత్యా ప్రయత్నాన్ని అన్నింటిని రికార్డు చేసి చట్టం దృష్టిలో అతనికెంతో శిక్ష పడుతుందో అన్నా చెల్లెలు చెప్పగా హరి తలొంచుకుని వెళ్లిపోతాడు. గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు.

మోతుగూడెంలో పుష్ప-2 షూటింగ్


సీలేరు నదిలో ఎర్రచదనం దుంగలు డంప్ చేసిన సన్నివేశం దృశ్యం

మోతుగూడెం, మే 17: చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టులో మంగంపాడు, పాలగడ్డ, డొంకరాయి, పొల్లూరు పరిసర ప్రాంతాల్లో వారం రోజులుగా చిత్రీకరించిన పుష్ప-2 సినిమా షూటింగ్ గురువారం ముగిసింది. సీలేరు నదిలో దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. శుక్రవారం జరిగిన కొన్ని సన్నివేశ చిత్రీకరణలో స్థానికులకు అవకాశం లభించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు

విశాఖపట్నం, మే 17: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు జి.సాంబయ్య (55) పిట్ (వేడి నీరు ఉండే ప్రాంతం)లో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలావున్నాయి....పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన సాంబయ్య శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా విభాగంలో 30 అడుగుల కిందకు దిగి పిట్‌లో నీటి (60డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన నీరు)ని పరిశీలిస్తున్నాడు. ఆ సమయంలో పిట్‌లో నీరు ఆరడుగులుంది. ప్రమాదవశాత్తు అందులో పడిపోవడంతో శరీరం కాలిపోయింది. విధుల్లోని ఉద్యోగులు హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు సంఘటన స్థలానికి పరిశీలించారు.

భానుడి భగభగ.. గిరి'జనం' విలవిల!

మన్యంలో భానుడు భగ్గుమంటున్నాడు. కొన్ని రోజులుగా భగభగ మండుతున్నాడు. దీంతో గిరి'జనం' విలవిలలాడుతున్నాడు. దీంతో గొడుగులను ఆశ్రయిస్తూ ఉపశమనం పొందుతున్నారు.

- మన్యంలో తగ్గని ఎండ ప్రభావం
- పాడేరులో అత్యధికంగా 34.2 డిగ్రీలు
- గొడుగులను ఆశ్రయిస్తున్న ప్రజలు

పాడేరు, మే 17 (ఆంధ్రజ్యోతి):

వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నా మన్యంలో ఎండ ప్రభావం తగ్గలేదు. దీంతో జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం 34.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీలో ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై తొమ్మిది గంటల తర్వాత నుంచి దాని తీవ్రత అధికమైంది. అలాగే ఉక్కపోత, వేడి వాతావరణం కొనసాగుతున్నది. తాజా వేడి వాతావరణానికి ఏజెన్సీ వాసులు సైతం అల్లాడుతున్నారు. శనివారం నుంచి సుమారు నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ ప్రకటనలతో మన్యం వాసులు ఊరట చెందుతున్నారు.

పాడేరులో 34.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

మన్యంలో శుక్రవారం పాడేరులో 34.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, అనంతగిరిలో 32 డిగ్రీలు నమోదైంది. అలాగే అరకులోయలో 32.3, చింతపల్లిలో 31.2, డుంబ్రిగుడలో 32.4, జీకేవీధిలో 28.5, జి.మాడుగులలో 32.7, హుకుంపేటలో 34.2, ముంచంగిపుట్టులో 32.6, కొయ్యూరులో 33.7, పెదబయలులో 30.0 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


పాడేరులో ఎండకు గొడుగులు వేసుకున్న రైతులు, వినియోగదారులు


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ సీఈవో వర్మ

గిరిజన రైతులకు రుణాలు

- డీసీసీబీ సీఈవో వర్మ

చింతపల్లి, మే 17: గిరిజన రైతులకు వ్యవసాయ రుణాలు పంపిణీ చేస్తామని డీసీసీబీ సీఈవో వర్మ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో లీఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీవో పరిధిలోని రైతుల వ్యవసాయ ప్రగతికి స్వల్ప వడ్డీకి పెట్టుబడి రుణాలు అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. అలాగే గిరిజన ప్రాంతానికి అనువైన వాణిజ్య సరళి పంటను రైతులు సాగు చేసుకోవాలన్నారు. వ్యవసాయంలో రైతులు రాణించేందుకు లీఫ్ సంస్థ ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు సాంకేతిక సహకారం అందిస్తారన్నారు. సంస్థ నుంచి రైతులకు మేలుజాతి విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ శ్రీనుబాబు, మేనేజర్ కుమార్, లీఫ్ సంస్థ ప్రతినిధి రఘువీర్ భద్రీనాథ్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయ సింహ ద్వారం ప్రారంభం


మోదకొండమ్మ ఆలయంలో సింహ ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్, మే 17: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు మోదకొండమ్మ ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సింహ ద్వారాన్ని ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మోదకొండమ్మవారి సింహ ద్వారం తన చేతులు మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సింహ ద్వార నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన పిన్ యూనివర్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ మీసాల దుర్గాప్రసాద్ కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్‌కు శాలువతో సత్కరించిన అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించారు. అమ్మవారి కార్యక్రమాల్లో భాగస్వామ్యుడుగా ఉండేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, వెంకటరమణ, వంతినిభ రాజబాబు, యాదగిరి శ్రీనివాసరావు, టి.ప్రసాదనాయుడు, యు.వెంకటరత్నం పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌ను సందర్శించిన జెన్‌కో డైరెక్టర్

- ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై ఆరా


జనరేటర్లను పరిశీలిస్తున్న ఏపీ జెన్‌కో డైరెక్టర్ హైడల్ సత్యనారాయణ

ముంచంగిపుట్టు, మే 17: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని ఏపీ జెన్‌కో డైరెక్టర్ హైడల్ ఎంవీవీ.సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు ఆధునీకరణ కోసం జనరేటర్ల పరీక్షలు జరుపుతున్న పనులను పరిశీలించారు. జనరేటర్ల వినియోగం, చేపడుతున్న విద్యుత్ ఉత్పత్తి, ప్రాజెక్టులో తరచూ తలెత్తే సమస్యలపై ప్రాజెక్టు అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూంలో అధికారులతో సమావేశం అయ్యారు. ప్రాజెక్టులో నెలకొన్న పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటడంతో ఉన్న నీటిని ఏ విధంగా వినియోగిస్తున్నారు, నీటి సమస్య తలెత్తకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు తదితర అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం జోలాపుట్టు జలాశయాన్ని ఆయన సందర్శించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందును ఆయన మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ సీఈ బొడ్డు శ్రీధర్, ఎస్ఈ సివిల్ కె.కె.వి.ప్రశాంత్ కిశోర్, ఎస్ఈ హెచ్‌పీసీ స్వామినాయుడు, ఎస్ఈ విద్యుత్ సౌద చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఈఈ జనరుషన్ బి.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్లోవలో ప్రత్యేక వైద్య శిబిరం


రోగులకు వైద్య పరీక్షలను చేస్తున్న డాక్టర్ సౌమ్య, సిబ్బంది

సీలేరు, మే 17: సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దుప్పులవాడ పంచాయతీ గొర్లోవ గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కె.సౌమ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 78 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రిలోనే ప్రసవాలు పొందాలని, దీనిల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని వివరించారు. అలాగే పురుషులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటినీ సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. అలాగే వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు ప్రతీ ఇంట్లో ఏసీఎం మందును పిచికారీ చేయించుకోవాలని సూచించారు. గుండేరుబైలు, పులిగొప్పు, కొమ్ములవాడ, బంధవీధి గ్రామాల్లో కూడా వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.జోజిబాబు, బి.బాలమణి, సత్యనారాయణ పాల్గొన్నారు.

120 మంది పిల్లలకు వైద్య పరీక్షలు


ప్రత్యేక అవసరాలుగల పిల్లల ప్రత్యేక వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరు రూరల్, మే 17: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక అవసరాలుగల పిల్లల వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. సమగ్ర శిక్ష ఐఈ కో-ఆర్డినేటర్ కె.భాస్కరరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన ప్రత్యేక అత్యవసరాలు గల 120 మంది పిల్లలతో పాటు 150 మంది తల్లిదండ్రులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని సీఆర్పీలు పాల్గొన్నారు.

సివిల్స్‌లో సత్తా చాటిన గిరిపుత్రుడికి సత్కారం

- గిరి యువతకు నరేంద్రపడాల్‌ను ఆదర్శమన్న వక్తలు

పాడేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): సివిల్స్-2023 ఫలితాల్లో 545 ర్యాంక్ సాధించిన జిల్లాకు చెందిన గిరిపుత్రుడు చిట్టపులి నరేంద్రపడాల్‌కు స్థానిక గిరిజన ఉద్యోగుల భవన్‌లో శుక్రవారం ఘనంగా సత్కరించారు. హుకుంపేట మండలం అండింభ గ్రామానికి చెందిన సిహెచ్.డాల్‌పడాల్, విజయ భారతి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లోనే సెటిలయ్యారు. వారి కుమారుడైన నరేంద్రపడాల్ విద్యాభ్యాసమంతా అక్కడే జరిగింది. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో ఆయన పీజీ చేస్తూ సివిల్స్ ప్రిపరేషన్‌లో భాగంగా నారాయణ ఐఏఎస్ అకాడమీలో చేరి, 2023 సివిల్స్ పరీక్షలకు హాజరైన 545 ర్యాంక్ సాధించారు. నరేంద్రపడాల్, అతని కుటుంబ సభ్యులను గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముఖిశేషాద్రి, బోయపల్లి సింహాచలం ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన పౌరసత్కారంలో ఘనంగా సత్కరించారు. గిరిజన ప్రాంతానికి చెందిన నరేంద్రపడాల్ సివిల్స్‌లో ప్రతిభ చూపి గిరిజన యువతకు ఆదర్శంగా నిలిచాడని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. నరేంద్రపడాల్ స్ఫూర్తితో గిరిజన విద్యార్థులు, యువత ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హేమతల, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు చిట్టపులి శ్రీనివాస్‌పడాల్, లకే వెంకటరమణదొర, నారాయణ, శెట్టి శాంతికుమారి, సిహెచ్.నాగరాజు పాల్గొన్నారు.


సిహెచ్.నరేంద్రపడాల్, కుటుంబ సభ్యులకు సత్కారం

మలేరియా నివారణకు ముందస్తు చర్యలు

- జిల్లా మలేరియా నివారణ అధికారి ప్రసాదరావు

ముంచంగిపుట్టు, మే 17: గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా నివారణ అధికారి ప్రసాదరావు చెప్పారు. మండలంలోని కరిముఖిపుట్టు పంచాయతీ తాంగుల గ్రామంలో జరుగుతున్న దోమల నివారణ మందు స్ప్రేయింగ్ పనులను శుక్రవారం పరిశీలించారు. స్ప్రేయింగ్ చేస్తున్న విధానంపై ఆయన ఆరా తీశారు. ఆ పనులకు సంబంధించి పలు సూచనలు, సలహాలను సిబ్బందికి అందించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి మలేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మురుగు నీటి నిల్వలు ఎక్కడపడితే అక్కడ లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల లోపల, బయట దోమల నివారణ మందును తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయించుకోవాలని, దోమల తెరలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటి విడత 128 గ్రామాల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం గ్రామాలకు వచ్చే సిబ్బందికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. మలేరియా మహ్మారిని నిర్మూలించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని, వైద్యులు తెలిపిన సలహాలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా నివారణ అధికారి (ఏఎంవో) శేషయ్య, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు, ఎంపీహెచ్‌వో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


దోమల మందు స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న డీఎంవో ప్రసాదరావు

గ్రామాల్లో జోరుగా బెట్టింగ్‌లు

- టీడీపీ తరపున బరిలో ఉన్న 'బండారు'కు మంచి మెజారిటీ అని కొందరు..
- వైసీపీ నుంచి పోటీ చేస్తున్న అనురాధ గెలుపు ఖాయమని మరికొందరు పందేలు
- మధ్యవర్తుల వద్ద లోపాయికారీగా ఒప్పంద పత్రాలు రాసుకుంటున్నట్టు సమాచారం

మాడుగుల, మే 17 : సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన మాడుగుల నియోజకవర్గ అభ్యర్థుల గెలుపుపై బెట్టిం గ్‌లు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 13వ తేదీన ఈ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ప్రధాన పార్టీకుల చెందిన అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. అయితే దీనిపై పలు గ్రామాల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. కూటమి మద్దతుతో టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బండారు సత్యనారాయణమూర్తి ఐదు వేల నుంచి పదివేల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని పలువురు పందేలు కాస్తుండగా, వైసీపీ నుంచి బరిలో ఉన్న బూడి ముత్యాలనాయుడు కుమార్తె అనురాధ విజయం సాధిస్తా రని మరికొందరు బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇందుకు సంబంధించి మధ్యవర్తుల వద్ద లోపాయికారీగా పలువురు అగ్రి మెంట్లు కూడా రాసుకుంటున్నట్టు సమాచారం. దీంతో అం తటా ఉత్కంఠ నెకొంది. దీనికి తెరపడాలంటే అంతా మరో పదిహేనురోజులు వేచి ఉండక తప్పని పరిస్థితి

మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా

... 5వ పేజీ తరువాయి

సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని తాజా ఘటనల నేపథ్యం, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున మోదకొండమ్మ ఉత్సవాల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఒకవేళ ఉత్సవాలను నిర్వహించుకోవాలనుకుంటే, ఎటువంటి హడావిడి లేకుండా కేవలం ఆలయంలో అమ్మవారికి పూజలతోనే సరిపెట్టాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని, నిబంధనల మేరకే ఉత్సవాలు జరపాల్సి ఉంటుందని వెల్లడించారు.

జూన్ 9, 10, 11 తేదీల్లో ఉత్సవాలు

రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన మోదకొండమ్మ ఉత్సవాలను జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించేందుకు నిర్ణయించామని ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రకటించారు. మోదకొండమ్మ ఉత్సవాలపై ప్రభుత్వ ఆంక్షలు నేపథ్యంలో శుక్రవారం ఆలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మోదకొండమ్మ ఉత్సవాలను వాయిదా వేస్తున్నామని, ఇప్పటికే దాదాపుగా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఉత్సవాలు వాయిదా పడుతున్న సంగతిని భక్తులు గమనించాలని, జూన్‌లో జరిగే ఉత్సవాలకు అందరూ సహకరించాలని భాగ్యలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

పాడేరులో అసెంబ్లీలో టీడీపీదే విజయం

- పార్టీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు


నాయకులు, కార్యకర్తలతో విజయ సంకేతం చూపుతున్న పూర్ణచంద్రరావు

చింతపల్లి, మే 17: పాడేరు నియోజకవర్గంలో టీడీపీదే విజయమని పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో భారీగా వ్యతిరేకత పెరిగిందన్నారు. దీంతో సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు టీడీపీకి ఓటు వేశారన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు పూర్తిగా టీడీపీకి పడిందన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు, ఏజెంట్లు తెలిపిన గణంకాల ప్రకారం కచ్చితంగా టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి దాదాపు పది వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అలాగే చింతపల్లి మండలంలో టీడీపీకి అత్యధిక మెజారిటీ వస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, లక్కోజు నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు


సంఘటనా స్థలంలో పడిపోయి గాయపడిన అన్నపూర్ణ, రాశి కుమారి

గూడెంకొత్తవీధి, మే 17: మండలంలోని అసరాడ తోటమామిడి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు గిరిజనులకు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం... కొయ్యూరు మండలంలోని మంప గ్రామానికి చెందిన మొట్టడం జీవన్ ద్విచక్ర వాహనంలో చింతపల్లి నుంచి కొయ్యూరు వెళుతున్నాడు. అదే సమయంలో గూడెంకొత్తవీధి మండలం కుమ్మరాపల్లి గ్రామానికి చెందిన పాంగి ధారబాబు, రాశి కుమారి, అన్నపూర్ణ ద్విచక్రవాహనంలో చింతపల్లి వస్తున్నారు. వీరి రెండు వాహనాలు అసరాడ తోటమామిడి గ్రామ సమీపంలో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న నలుగురు గిరిజనులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ప్రజలు క్షతగాత్రులను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చిరంజీవి, రాశి కుమారి, అన్నపూర్ణలకు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు.

సంక్షిప్తంగా..

20న ఎస్‌వోఈ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

చింతపల్లి, మే 17: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎస్‌వోఈ) కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు విశాఖపట్నం మారికవలస గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో ఈ నెల 20వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రామేశ్వరం తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు మారికవలస, విస్సన్నపేట ఎస్‌వోఈ ప్రవేశాలు పొందేందుకు ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష జరిగిందన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. అర్హులైన విద్యార్థినులకు కాల్ లెటర్లు పంపించడంతో పాటు ఫోన్‌లో సమాచారం ఇచ్చామన్నారు. ఎంపికైన విద్యార్థులు టీసీ, పదో తరగతి మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్ కార్డు, ఫిజికల్ ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

ఉపాధి కూలి రూ.300 చెల్లించాలి

డుంబ్రిగుడ, మే 17: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు రోజువారీ కనీస వేతనం రూ.300 చొప్పున చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నప్పటికీ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు పనులు చేస్తున్నప్పటికీ కనీస వేతనం అందకపోవడంతో కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమ్మర్ అలవెన్స్‌తో పాటు ఉపాధి కూలీల కనీసం వేతనం కూడా పెంచాలని అయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



మోతుగూడెం అంబేడ్కర్ సెంటర్‌లో బస్సు నిలిచిపోవడంతో రోడ్డుపై ఉన్న ప్రయాణికులు

మోతుగూడెం, మే 17: చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు విశాఖపట్నం-భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు మోతుగూడెం అంబేడ్కర్ సెంటర్లో మొరాయించింది. దీంతో బస్సులో ఉన్న 31 మంది ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. వీరంతా భద్రాచలం వెళ్లాలి. దీంతో కొంతమంది సీలేరు టు విజయవాడలోని ఆర్టీసీ బస్సులో వెళ్లారు. మొరాయించిన బస్సు క్లచ్ ప్లేట్లు పోయి ఆయిల్ సీల్ కొట్టేసిందని డ్రైవర్ తెలిపారు. ఘాటీలో ప్రయాణించే బస్సులు మెరుగైనవిగా ఉండాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గోమంగి పీహెచ్‌సీలో రక్షణ సిబ్బందిని నియామించరూ...

పెదబయలు, మే 17: గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్షణ సిబ్బందిని నియమించాలని పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో రక్షణ గోడ వివదాలు ఉన్న కారణంగా పనులు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీంతో రాత్రి సమయాల్లో విధులు నిర్వంచే సిబ్బందికి ఇబ్బందిగా మారుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తగిన కృషి చేస్తామని ఈ సందర్భంగా వైద్యులు హామీ ఇచ్చినట్టు స్థానికులు తెలిపారు.

మూగ జీవాలతో ప్రమాదం

డుంబ్రిగుడ, మే 17: మండలంలోని ప్రధాన రహదారులకు అడ్డంగా మూగజీవాలు సేదతీరుతున్నాయి. రాత్రి పూట రోడ్డుకడ్డంగా మూగజీవాలు ఉండడంతో పరిస్థితి ప్రమాదంగా మారుతోంది. మండలంలోని అరుకు, డుంబ్రిగుడ, బల్లుగుడ, కించుమండ జాతీయ రహదారిలో రాత్రుల్లో మూగజీవాలు అడ్డంగా సేదతీరుతున్నాయి. ఇటూ వైపు ప్రయాణించే వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నా, రోడ్డుకు అడ్డంగా సేదతీరుతుండడంతో రాత్రుల్లో ప్రమాదాల బారిన పడుతున్నారని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదాలకు అడ్డంగా సేదతీరే మూగజీవాలను స్థానికులు రోడ్లో వెంబడి ఉంచకుండా తరలించుకునేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


రహదారిపై సేదతీరుతున్న పశువులు